క్లుప్తంగా

బడి బయటి పిల్లల సర్వే



పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న సీఆర్పీ సందీప్

వాంకిడి: మండలంలోని తేజీగూడ, ఘాట్‌జన గాం గ్రామాల్లో సోమవారం బడి బయటి పిల్లల సర్వే నిర్వహించారు. 6–14 ఏళ్లలోపు ఆరుగురు బడిబయట పిల్లలను గుర్తించి బెండార పాఠశాలలో చేర్పించినట్లు సీఆర్పీ సందీప్ తెలిపారు. 15–18 ఏళ్ల వయస్సు ఉన్న ఒకరిని గుర్తించి ఓపెన్ టెన్త్ చదువుకునేలా ప్రోత్సహించారు. చదువు మధ్యలో మానేసిన బడి బయటి పిల్లలు ఉంటే 9666665253 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీటీసీ ప్రవీణ్, గ్రామస్తులు

వాంకిడి: అర్ధంతరంగా నిలిపివేసిన ఖమాన రహదారి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ హిప్రే ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రం నుంచి 3 కి.మీ ఖమాన రహదారి కంకరతేలి అధ్వానంగా ఉందన్నారు. నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ గత ఆరు నెలల నుంచి పనులు చేయకుండా అర్ధంతరంగా వదిలేసి కాలయాపన చేస్తున్నారని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ నాయకులు బ్రహ్మయ్య, నానేష్, తదితరులు ఉన్నారు.

జాబ్ మేళాకు స్పందన

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధి కల్పన శాఖ సౌజన్యంతో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాలో హైదరాబాద్‌కు చెందిన మెడిప్లస్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ సాయి శైలేశ్, ప్రతినిధులు పాల్గొని వివిధ ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేశారు. అనంతరం జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగుల కోసం వివిధ కంపెనీలను సంప్రదించి జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రి న్సిపాల్ డి.లక్ష్మీ నరసింహం మాట్లాడుతూ జిల్లా ఉపాధి కల్పన శాఖ సహకారంతో రాను న్న రోజుల్లో కళాశాల విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం మరిన్ని జాబ్‌మేళాలు ఏర్పా టు చేస్తామని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళా లో దాదాపు 60 మంది అభ్యర్థులు పాల్గొనగా ఎనిమిది మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.జనార్దన్, ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న ఎంపీపీ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని ఆర్‌ఆర్ కాలనీ ఆర్ఫన్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ మల్లికార్జున్, ఎంపీడీవో శశికళ సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంఈవో మను కుమార్, కార్యదర్శి వంశీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు సాయం అందించాలి

కౌటాల: ప్రతి ఒక్కరూ పేదలకు సాయం అందించాలని ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. మండలంలోని శివాలింగపూర్‌లో సోమవారం వృద్ధులకు ఆయన ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. పాదర్ థామస్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కిరణ్‌ను బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. పార్టీ నాయకులు, జిల్లా యూత్ అధ్యక్షుడు అమ్మ శ్రీకాంత్, జిల్లా నాయకులు ఆవుల రాజ్‌కుమార్, శ్యామ్‌రావు, మహేశ్, దేవాజి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కంప్యూటర్, టైలరింగ్, ఇతర అంశాల్లో నైపుణ్య శిక్షణ (స్కిల్ డెవలప్‌మెంట్) ఇవ్వనున్నట్లు సిర్పూర్ పేపర్‌మిల్ సీఎస్సార్ ప్రతినిధి రీనా పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం సందర్శించి విద్యార్థులకు ఇచ్చే శిక్షణపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల తిష్ట



గుంతలమయమైన తుంగమడుగుకు వెళ్లే రోడ్డు

- తుంగమడుగులో సౌకర్యాలు కరువు
- ఇబ్బందుల్లో ప్రజలు



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని తుంగమడుగు గ్రామంలో సమస్యలు తిష్ట వేశాయి. మౌలిక వసతులు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో సుమారు 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే ఈ గ్రామానికి ఇప్పటివరకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అవస్థలకు గురవుతున్నారు. అదేవిధంగా మురుగుకాలువలు లేవు. దీంతో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. తీవ్ర దుర్గంధం రావడంతో వారు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అలాగే, వర్షాకాలంలో దారి మొత్తం బురదమయంగా మారుతుండటంతో కాలినడకన వెళ్లలేని పరిస్థితి. 108 వాహనాలు రాక రోగులు అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కాగజ్‌నగర్ మండల కేంద్రానికి కేవలం 5 కి.మీ దూరంలోని తమ గ్రామం పట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు చిన్నచూపు చూస్తుండటం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో చిన్నారులు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

పట్టించుకోవాలి



రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నాం. వానాకాలంలో బురదరోడ్డులో నడవలేక జారిపడిపోతున్నాం. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లలేని పరిస్థితి. అధికారులు పట్టించుకుని గ్రామంలో సమస్యలు పరిష్కరించాలి.
– పంబాల కృష్ణ, తుంగమడుగు

తాగునీరు రావడం లేదు



మిషన్ భగీరథ నల్లా బిగించలేదు. మంచినీరు రావడం లేదు. సెంటు భూమి లేకున్నా ఇప్పటివరకు తెల్ల రేషన్‌కార్డు రాలేదు. దీంతో బియ్యం రావడంలేదు. అధికారులు దయ చూపి న్యాయం చేయాలి.
– పులబోయిన మల్లమ్మ, తుంగమడుగు

ఓటరు నమోదుపై శిక్షణ



దహెగాం: బీఎల్‌వోలకు శిక్షణ ఇస్తున్న డీటీ లలిత

పెంచికల్‌పేట్: స్థానిక రైతు వేదికలో డిప్యూటీ తహసీల్దార్ సరిత ఆధ్వర్యంలో సోమవారం బీఎల్వోలకు ఓటరు నమోదు, సవరణపైన ఒక రోజు శిక్షణ నిర్వహించారు. నూతన ఓటరు నమోదు, ఇతర ఫాం–6, ఫాం–8లపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరు నమోదు చేయాలన్నారు. సూపర్‌వైజర్లు గోపాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): రైతువేదికలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు ఓటరు నమోదు, మార్పులు చేర్పులు, సవరణలపై అవగాహన కల్పించారు. ఈనెల 20 నుంచి జనవరి 5 వరకు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ జుగాడిరావ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దహెగాం: స్థానిక రైతు వేదికలో బీఎల్‌వోలకు డీటీ లలిత శిక్షణ ఇచ్చారు. ఇందులో బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

‘జాతీయ సంఘాలతో ఒరిగేది శూన్యం’



మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాస్‌రావు

రెబ్బెన: టీబీజీకేఎస్‌తోనే కార్మికులకు హక్కులు సాధ్యమవుతాయని, జాతీయ సంఘాలతో ఒరిగేది శూన్యమని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో సింగరేణి ఉద్యోగులను కలిసి మాట్లాడారు. కార్మికులకు ఐటీ నుంచి మినహాయింపు లభించేలా కృషి చేస్తామన్నారు. జాతీయ సంఘాలతో కార్మికులు పోరాటాలతో సాధించుకున్న అనేక హక్కులు దూరమయ్యాయన్నారు. కార్యక్రమంలో 11మెన్ కమిటీ సభ్యులు దారావత్ మంగీలాల్, జీఎం కమిటీ సభ్యులు మంతు సమ్మయ్య, అలవేణి సంపత్, మహేందర్‌రెడ్డి, ఆర్, శ్రీనివాస్, ఫిట్ కార్యదర్శి రమేశ్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి సదానందం, నాయకులు విద్యాసాగర్, శ్రీనివాస్, సుగ్రీవులు పాల్గొన్నారు.

‘ఆరు గ్యారంటీలతో భవిష్యత్తుకు భరోసా’



మాట్లాడుతున్న సిద్దంశెట్టి రాజమౌళి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఐఎన్‌టీయూసీ గుర్తింపు సంఘం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలతో కార్మికుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తామని ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి రాజమౌళి అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘంగా పనిచేసిన టీబీజీకేఎస్, ఏఐటీయూసీలో సింగరేణిని పూర్తిగా నిర్వీర్యం చేశాయన్నారు. ఈనెల 27న జరగబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులంతా ఐఎన్‌టీయూసీని గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ పాలనలో, టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉండి సింగరేణిలో ఆర్థిక దోపిడికి కారణమయ్యాయని అన్నారు. సంస్థలో పెరిగిన మితిమీరిన రాజకీయ జోక్యంతో కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా పోయాయని అన్నారు. అనంతరం పలు యూనియన్లకు చెందిన కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సీహెచ్‌పీ ఫిట్ కార్యదర్శి రవికుమార్, నాయకులు జీపీ చంద్రకుమార్, పల్లాస్, సూర్యనారాయణ, కాంపెల్లి రమేశ్, రఫీ, అనిల్, రవీందర్, రాజు, అరివేష్, పర్వేజ్, సంతోష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో కోతలు వద్దు



సిర్పూర్(టి): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కౌటాల: వరి ధాన్యం కొనుగోళ్లలో కోతలు వద్దని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం సాండ్‌గాం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. స్థానిక రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి కటింగ్ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. స్థానిక సర్పంచ్ దామోదర్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ఎత్తిపోతల పథకం గత కొన్నేళ్లుగా పని చేయడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలను త్వరలో బాగు చేయించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అదేవిధంగా లోనవెల్లి మీదుగా ముత్తంపేట నుంచి కౌటాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఏవో రాజేశ్, ఏపీఎం వెంకటరమణ, ఏఈవో శ్రీకన్య, కార్యదర్శి రాజేశ్వరి, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, సిర్పూర్ జెడ్పీటీసీ నీరటి సురేఖ, నాయకులు మధుకర్, చందు, తిరుపతి పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని లోనవెల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రాలతోపాటు రైస్‌మిల్లర్లలో రైతులు విక్రయించిన ధాన్యంలో కోత లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఐకేపీ మహిళా సంఘం సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. జెడ్పీటీసీ నీరటి రేఖ, ఏడీ రామకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఏపీఎం దుర్గయ్య, ఏఈవో శ్రీనివాస్, నాయకులు నీరటి సత్యనారాయణ, ఎల్ములే శంకర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలం, నేరెళ్ళ అశోక్, వడ్డేటి నానయ్య, నులిగొండ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న పీడీలు

ఆసిఫాబాద్‌రూరల్: హైదరాబాద్‌లో ఈనెల 17న జరిగిన రాష్ట్రస్థాయి పత్య పోటీల్లో విద్యార్థి ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లాకేంద్రంలోని సెయింట్ మేరీ పాఠశాల విద్యార్థి సాయివర్ధన్‌ను ప్రిన్సిపాల్ మోరీ, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. ఈనెల 26న పుదుచ్చేరిలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో సాయివర్ధన్ పాల్గొంటారని వివరించారు. అత్య పత్యా జిల్లా అధ్యక్షుడు భీంరావు, పీడీ కిరణ్, రాకేశ్ ఉన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు



కృత్యాధార బోధనను పరిశీలిస్తున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్ పరిశీలనలో భాగంగా మండలంలోని ఖైరీ, ఆగర్‌వాడ ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో చదివించారు. బోర్డుపై రాయించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కృత్యాధార బోధన అవసరమన్నారు. మండలంలోని కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు సమయానికంటే ముందే బడి నుంచి బయల్దేరుతున్నారని గ్రామస్తుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తున్నాయన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌లో యాప్‌లో విద్యార్థుల హాజరువేయాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు పదో తరగతి విద్యార్థులు జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నారాయణ్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సోమవారం విద్యార్థులు సంజీవ్, నక్క రజినికాంత్, అంజన్నను అభినందించారు. నల్గొండలో ఈనెల 30న, జనవరి 1, 2 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు రమేశ్, హరీశ్, సత్యనారాయణ, శ్యాంరావు ఉన్నారు.

గ్రామాల్లో భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర



ఇందిరానగర్‌లో కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

రెబ్బెన: మండలంలోని కైరిగాం, ఇందిరానగర్ గ్రామాల్లో సోమవారం కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సంకల్ప్ యాత్ర ప్రచార రథయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి రవికుమార్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర నిర్వహిస్తున్నామని అన్నారు. ఆయుష్మాన్ భారత్, గరీబ్ కల్యాణ్, అన్నయోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవన జ్యోతి బీమా, సురక్ష బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సుజిత్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, సర్పంచులు కార్తీక్, రాజ్యలక్ష్మి, ఏఈవో రాకేశ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే హరీశ్‌బాబును సన్మానిస్తున్న పదాధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబును పీఆర్టీయూ ఆధ్వర్యంలో సన్మానించారు. పట్టణంలో సోమవారం ఆయనను కలిసి శాలువతో సత్కరించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డార్ఫ్ అడుగుజాడల్లో నడవాలి



ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ను సన్మానిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు

జైనూర్: దివంగత ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ అడుగుజాడల్లో యువత నడవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మండలంలోని మార్లవాయి గ్రామాన్ని ఆదివారం రాత్రి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైమన్ డార్ఫ్ దంపతులు ఆదివాసీల అభివృద్ధికి చేసిన కృషిని ఆదివాసీ సమాజం ఎన్నటికి మరువదన్నారు. మార్లవాయి అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులతో కలిసి పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు ఎమ్మెల్యేను సన్మానించారు. సర్పంచి కనక ప్రతిభ వెంకటేశ్, సార్మేడి జుగ్నక దేవురావు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పెర్క్స్‌పై ఆదాయపు పన్నును భరించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు

రెబ్బెన(ఆసిఫాబాద్): హెచ్‌ఎంఎస్‌ను గుర్తింపుగా గెలిపిస్తే కోల్ ఇండియాలో మాదిరిగా సింగరేణిలో సైతం పెర్క్స్‌పై ఆదాయపు పన్నును యాజమాన్యమే భరించేలా చేస్తామని హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్‌లో సోమవారం గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో ఏఐటీయూసీ పోగొట్టిన డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్మికులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల హెచ్‌ఎంఎస్‌తోనే సాకారం అవుతుందన్నారు. టీబీజీకేఎస్ వైఫల్యం కారణంగా బెల్లంపల్లి ఏరియాలోని ఎక్స్‌ప్లోరేషన్ డిపార్టుమెంట్ మూసివేసినట్లు, వర్క్‌షాప్‌ను సైతం మూసివేసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. వర్క్‌షాప్‌కు పూర్వవైభవం రావాలన్నా, కార్మికుల కష్టాలు తీరాలన్నా హెచ్‌ఎంఎస్‌ను ఆదరించాలని అన్నారు. సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలైన టీబీజీకేఎస్, ఏఐటీయూసీ సంఘాలు యాజమాన్యానికి సహకరిస్తూ ఏరియానే కనుమరుగు చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్న పైరవీ సంఘాలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈనెల 27న జరగబోయే ఎన్నికల్లో కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడే హెచ్‌ఎంఎస్‌ను ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఏరియా ఆర్గనైజర్ ఎస్‌కే ఇనూస్, పిట్ కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, రామకృష్ణ, హాస్పిటల్ ఇన్‌చార్జి ఆర్.శ్రీనివాస్, ఆర్గనైజర్ సుంకరి ఓంకార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కౌటాల: ప్రతి ఒక్కరూ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి కోరారు. కౌటాల టీజీబీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకు సిబ్బంది మనోహర్, రాజేశ్, సీసీ వెంకటేశ్, నీరజ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పెంచికల్‌పేట్: స్థానిక రైతు వేదికలో ఈనెల 20న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గంగాసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ జాజిమొగ్గ సుజాత అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

‘అధైర్యపడొద్దు..అండగా ఉంటా’

కెరమెరి: కాంగ్రెస్ కార్యకర్తలు ఆపదలోనూ అధైర్యపడొద్దని..అండగా నేనుంటానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని, ఇది ప్రజల ప్రభుత్వమన్నారు. అన్నివర్గాల వారికి సమన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీల్లో ఇప్పటికి రెండు అమలు చేసినట్లు తెలిపారు. ఈనెల 28న మరో రెండు గ్యారంటీలు అమలవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మిలింద్, సాజిద్ దేశ్‌ముఖ్, వెంకటి దండుగుల, సాగర్, గోపి, సాయిరాం, తానాజి, ఖదీర్, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు అధైర్యపడొద్దు

జైనూర్: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, కార్యకర్తలు అధైర్యపడొద్దని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు శ్యామ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ప్రజలు ఆ పాలనను గమనించారన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్, బ్లాక్ అధ్యక్షుడు అయ్యూబ్‌ఖాన్, నాయకులు సుద్దాల శ్రీనివాస్, షేక్ ఇస్లాం నాయకులు తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

కౌటాల: మండలంలోని తలోడి సమీపంలో మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్, శ్యాంలాల్ తెలిపారు. బియ్యాన్ని తరలిస్తున్న ఏ.గోపాల్, ఏ.ఆశాలు, కె.దేవాజీ, పి.అంజయ్య, ఎస్.కిశోర్, బి.భీమయ్యపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.